ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 17 జూలై 2024

నీటి ఎద్దడి లేకుండా చూడండి

● అధికారులతో కలెక్టర్ శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూలై 16: జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గ్రామీణ నీటి సరఫరా, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈ, ఈఈలు, డీఈలు, మున్సిపల్ శాఖల అధికారులతో జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, పట్టణ నీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా, ట్యాంకర్లతో నీటిని తోలుతున్న పరిస్థితి గురించి ఎస్ఈ ప్రసన్నకుమార్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటిఎద్దడి లేకుండా చూడాలని, జల్‌జీవన్ మిషన్, ఎంపీ ల్యాడ్స్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీటిసరఫరాపై ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట, రాయచోటి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి...

● ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహలు తయారు చేయొద్దు

జిల్లాలో వినాయక చవితికి, దసరాకు మట్టి విగ్రహాలు మాత్రమే వినియోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాలు తయారు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీవోలతో పర్యావరణ పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటివనరులు తక్కువగా ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో మట్టి విగ్రహాలను తయారు చేయకుండా జాగ్రత్తలు తీపుకోవడమే కాకుండా అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, వారికి అధిక మొత్తంలో జరిమానాలు విధించాలని ఆర్డీవోలను ఆదేశించారు. అలాగే పంచాయతీలలో ఇలాగే చేయాలని డీపీవోలను ఆదేశించారు. వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలిపారు. మట్టితో చేసిన విగ్రహాలను మాత్రమే ప్రజలందరూ వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఆర్డీవో మోహనరావు, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, రాజంపేట కమిషనర్, డీపీవో ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ రాక

● మదనపల్లె సత్సంగ్‌లో ఏర్పాట్లు పూర్తి

● బాబాజీ ఆలయం ప్రారంభించనున్న మంత్రి


ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయం

మదనపల్లె, జూలై 16: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం మదనపల్లెకు రానున్నారు. మదనపల్లె శివారులోని సత్సంగ్ ఫౌండేషన్, ఆశ్రమ అధినేత, పద్మశ్రీ అవార్డుగ్రహీత ఎస్.ముంతాజ్‌అలీ (శ్రీఎం) ఆహ్వానం మేరకు రానున్నారు. సత్సంగ్ ఆశ్రమం ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని ప్రారంభించనున్నారు. మంత్రి రాక సందర్భంగా ఆశ్రమం ఆవరణంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు ప్రముఖులు, అధికారులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా గ్యాలరీలు, అందులోకి వెళ్లేందుకు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక బెంగళూరు రోడ్డు నుంచి నక్కలదిన్నెలోని సత్సంగ్ ఆశ్రమం వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి శుభ్రం చేయడంతో పాటు శానిటేషన్ పనులు చేపట్టారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీసులు, రోడ్లు, భవనాల శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తుండగా, మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 1:15 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1:40 గంటలకు చిప్పిలి సమీపంలోని మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నక్కలదిన్నెలోని సత్సంగ్ ఫౌండేషన్ ఆశ్రమానికి చేరుకుంటారు. అక్కడ 2 గంటలకు ఆశ్రమాన్ని పరిశీలించి భోజనం చేయనున్నారు. తర్వాత సాయంత్రం 6 గంటలకు ఆలయ నిర్వాహకులతో సమావేశమై బాబాజీ ఆలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం అక్కడి నుంచి 8 గంటలకు బయలుదేరి రాత్రి 8:30 గంటలకు తిరుపతిలోని వకుళమాత నిలయం అతిథి గృహానికి చేరుకోనున్నారు. గతంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సరిగ్గా గత ఏడాది జూలై 13వ తేదీ ఇదే ఆశ్రమానికి విచ్చేశారు. శ్రీఎం స్థాపించిన స్వస్థ హాస్పిటల్‌ను ప్రారంభించారు. దీంతో కేంద్రమంత్రి మదనపల్లెకు రావడం ఇది రెండోసారి.


శేషాచలం అడవి

శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను వైసీపీ ప్రభుత్వ హయాంలో స్మగ్లర్లు మింగేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో స్మగ్లింగ్‌కు అడ్డుకట్టే లేకుండా పోయింది. వైసీపీ నాయకుల అండదండలతో స్మగ్లర్లు ఎర్రచందనం చెట్లను నిలువునా నరికివేసి అక్రమంగా ఎల్లలు దాటించారు. స్మగ్లర్లకు వైసీపీ ఖద్దరు బాబులు అండగా నిలిచి కోట్లాది రూపాయలు సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక స్మగ్లర్లతో పాటు తమిళ నాడుకు చెందిన స్మగ్లర్లు యథేచ్ఛగా అడవుల్లోకి ప్రవేశించి మొత్తం ఎర్రచందనాన్ని పూర్తిగా ఊడ్చేశారు.

ఎర్రబంగారాన్ని మింగేశారు

● ఐదేళ్ల వైసీపీ పాలనలో యథేచ్ఛగా ఎర్రచందనం స్మగ్లింగ్

● స్మగ్లర్లకు వైసీపీ ఖద్దరు బాబుల అండ

● రెచ్చిపోయిన స్మగ్లర్లు... కోట్లాది రూపాయల సంపాదన

● స్మగ్లర్లు, వారికి సహకరించిన వారిపై కూటమి ప్రభుత్వం దృష్టి

● స్మగ్లర్లు, నాయకుల్లో మొదలైన వణుకు

రైల్వేకోడూరు, జూలై 16: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో స్మగ్లర్లు అడవులను చెరబట్టారు. తమిళనాడుకు చెందిన కూలీలతో నిత్యం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికివేసి అక్రమంగా తరలించి కోట్లాది రూపాయలు సంపాదించారు. వారికి స్థానిక వైసీపీ నేతలు కూడా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. రాజంపేట అటవీ డివిజన్ పరిధిలో రైల్వేకోడూరు, బాలపల్లె, చిట్వేలి, సానిపాయి తదితర రేంజిలు ఉన్నాయి. రైల్వేకోడూరు మండలం ఎడమ వైపు తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట, ఒంటిమిట్ట, కడప వరకు శేషాచలం అడవులు ఉన్నాయి. కుడివైపు నుంచి పెనుశిల అభయారణ్యం వరకు వెలుగొండ అడవులు ఉన్నాయి. కడప సమీపంలో పాలకొండలు తదితర ప్రాంతాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. అత్యంత విలువైన, అరుదైన ఎర్రచందనం చెట్లు ఆయా ప్రాంతాల అడవిలో విస్తారంగా ఉండేవి. గతంలో ఎర్రచందనం చెట్లు అంటే చాలా మందికి తెలియదు. రానురాను వాటి విలువ తెలిసిన స్థానికులు ఎక్కువగా స్మగ్లర్లుగా మారి దుంగలను స్మగ్లింగ్ చేసేవారు. తర్వాత తమిళ స్మగ్లర్లు స్థానిక స్మగ్లర్లతో కలసి అక్రమంగా రవాణా చేశారు. జపాన్, చైనా తదితర దేశాలలో ఎర్రచందనం దుంగలకు విలువ పెరిగింది. ఆయా దేశాల్లో ఎక్కువగా ఎర్రచందనం దుంగలను గృహోపకరణాలు, కొత్తగా వివాహం చేసుకున్న జంటకు షామ్‌షైన్ అనే సంగీత పరికరాన్ని బహుమతిగా ఇచ్చేవారు. దీంతో స్మగ్లింగ్ విపరీతంగా పెరిగిపోయింది. అదేకాకుండా వీరప్పన్ మరణం తర్వాత తమిళనాడులోని జావాదిమలై వాసులు స్థానికులతో సంబంధాలు లేకుండా నేరుగా రైల్వేకోడూరు, రాజంపేట, ఒంటిమిట్ట, సానిపాయి తదితర ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనం చెట్లను నరికివేసి కర్ణాటక తదితర రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేసి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా స్మగ్లింగ్ జరిగినా తూతూమంత్రంగా దాడులు జరిపి కేసులు నమోదు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

రాజంపేట డివిజన్ మొత్తంగా 2019-20లో 79 కేసులు నమోదు చేసి 1167 దుంగలు, 53 వాహనాలు, 269 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 2020-21 లో 40 కేసులు, 742 దుంగలు, 19 వాహనాలు, 132 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 2021-22లో 53 కేసులు, 1103 దుంగలు, 30 వాహనాలు, 182 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 2022-23 26 కేసులు, 170 దుంగలు, 10 వాహనాలు, 60 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 2023-24 లో 29 కేసులు, 224 దుంగలు, 22 వాహనాలు, 64 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. కొన్నిసార్లు స్మగ్లర్లు దొరకకుండా కేసులు మాత్రమే నమోదయ్యాయి. వాటి వివరాల్లోకి వెళితే... 2019-20లో 42 కేసులు, 451 దుంగలు, 6 వాహనాలు, 2020-21లో 36 కేసులు, 589 దుంగలు, 9 వాహనాలు, 2021-22లో 35 కేసులు, 573 దుంగలు, 527 వాహనాలు, 2022-23లో 48 కేసులు, 512 దుంగలు, 642 వాహనాలు, 2023-24లో 21 కేసులు, 204 దుంగలు, 660 వాహనాలను అధికారులు సీజ్ చేశారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ విచ్చలవిడిగా జరుగుతున్న సమయంలో 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎర్రచందనం చెట్లను కాపాడాలని రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్సు విభాగాలను రంగంలోకి దింపింది. రాష్ట్రంలో చాలా ఆపరేషన్లు సాగించే క్రమంలో స్మగ్లర్లు అధికారులపై తిరగబడడంతో వారిని అంతం కూడా చేశారు. పెద్ద, పెద్ద స్మగ్లర్లు, విదేశాల్లో దాక్కున్న వారిని సైతం అరెస్టు చేశారు. పదేపదే స్మగ్లింగ్ చేసిన స్మగ్లర్లపై పీడీ యాక్టులు నమోదు చేసి స్మగ్లింగ్‌ను అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తిగా కట్టడి చేసింది. అనంతరం 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మగ్లర్లు వైసీపీ నాయకుల అండతో స్మగ్లింగ్ కార్యకలాపాలను వేగం చేశారు. స్మగ్లర్లతో పాటు వారికి అండగా నిలిచిన వైసీపీ నాయకులకు కొందరు అధికారులు సహకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో స్మగ్లింగ్‌కు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికారులు వీలుపడని పరిస్థితిలో కొద్దోగొప్పో ఎర్రచందనం దుంగలను పట్టుకుని కేసులు నమోదు చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎర్రచందనం చెట్లను నరికివేసి అడవులను దాదాపు ఖాళీ చేశారు. ప్రస్తుతం అడవుల్లో ఎక్కడో అరకొరగా ఉన్న ఎర్రచందనం చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. గతంలో ఎక్కడ పడితే అక్కడ ఈ చెట్లు విస్తారంగా ఉండేవి. వైసీపీ పుణ్యమాని చెట్లు లేకుండా పోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు మార్కెట్‌లో ఎర్రచందనం ఏ-గ్రేడు టన్ను రూ.కోటి విలువ చేస్తుంది. ప్రభుత్వ విలువ టన్ను రూ.5 లక్షలు ఉంటుంది. బీ-గ్రేడు, సీ-గ్రేడ్లు కూడా ఉన్నాయి.

ఎర్రచందనం దుంగలను స్మగ్లర్లు వాహనంలో రవాణా చేసేటపుడు పైలెట్లు ఉంటారు. చెక్‌పోస్టుల్లో ఎవరు ఉన్నారు మనకు అనుకూలంగా ఉన్నారా లేదా, ఉంటే వారికి డబ్బులు ముట్టాయా లేదా అనేది మొత్తం స్మగ్లర్లు ఆరా తీస్తారు. తర్వాత అనుకూలతను బట్టి తరలిస్తారు. అడవిలో ఒక్క చెట్టు కొట్టిన కూలీకి రూ.10 వేలు ఇస్తారు. ఒక్క కూలీ ఎన్ని చెట్లు నరికితే అంత డబ్బు ఇస్తారు. చెట్లు నరికివేసే కూలీలు దుంగలను కూడా వాహనం దగ్గరకు మోయాల్సి ఉంటుంది. బడా స్మగ్లర్లు కంటికి కనిపించరు. ఎక్కడో ఉంటారు. కూలీలను పురామాయించి పంపుతారు. వారికి కావాల్సిన తినుబండారాలను దళారులు ఇచ్చి వారికి అడవిలో దారులు చూపిస్తారు. తర్వాత అడవిలోకి వెళ్లి చెట్లను నరికి వేస్తారు. బిచ్చగాళ్లు, తిరుమల భక్తులు తదితర వేషాల్లో కూలీలు అడవుల్లోకి ప్రవేశిస్తారు. పని పూర్తయిన వెంటనే లారీలు, వ్యాన్లు, కార్లు తదితర వాహనాలు అడవి సమీపానికి చేరుకుంటాయి. అక్కడి నుంచి అక్రమంగా దుంగలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్మగ్లర్లు, వారితో సంబంధాలు ఉన్న నాయకులను వదిలిపెట్టకుండా వారిపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. పరారీలో ఉన్న స్మగ్లర్లు, కేసులు నమోదైనా అరెస్టు కాని స్మగ్లర్లు, రాష్ట్రంలో ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఇందులో వైసీపీ నాయకుల పాత్ర, సంబంధాలు, భాగస్వామ్యం తదితర విషయాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆరా తీస్తోంది. ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడికి ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.


దొరికిన ఎర్రచందనం దుంగలు (ఫైల్)


రైల్వేకోడూరు అటవీ శాఖ పార్కులో పెరుగుతున్న ఎర్రచందనం చెట్లు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి గోబ్యాక్

● తొలిసారి తంబళ్లపల్లెలో తన నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే

● ఎమ్మెల్యేను పంపించేయాలంటూ రాస్తారోకో, ఆందోళనలు

● టీడీపీ, జనసేన నేతలను ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు


తంబళ్లపల్లెలో పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, జూలై 16: ఎమ్మెల్యే డౌన్..డౌన్...దొంగ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గోబ్యాక్... తంబళ్లపల్లెకు వచ్చిన ఎమ్మెల్యేను ఇక్కడి నుంచి పంపించి వేయాలంటూ టీడీపీ, జనసేన శ్రేణులు మంగళవారం తంబళ్లపల్లెలో ఆందోళన చేపట్టాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మొదటిసారి తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ఆయన నివాసానికి సోమవారం వచ్చారు. ఎమ్మెల్యేను తంబళ్లపల్లెలో అడుగు పెట్టనివ్వమని టీడీపీ శ్రేణులు ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో గొడవలు జరుగుతాయనే సమాచారంతో ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసులు, కేంద్ర బలగాలు సోమవారం తంబళ్లపల్లెలో మోహరించాయి. ఎమ్మెల్యే తంబళ్లపల్లెకు వచ్చాడన్న విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మంగళవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున తంబళ్లపల్లెకు చేరుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఉత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ఎమ్మెల్యే గోబ్యాక్, అంటూ నినాదాలు చేసుకుంటూ టీడీపీ, జనసేన నేతలు మూకుమ్మడిగా ఎమ్మెల్యే ఇంటి వైపుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న సీఐ మధు, ఎస్ఐ శివకుమార్, ఇతర మండలాల ఎస్ఐలు, సిబ్బందితో కలసి ఎమ్మెల్యే ఇంటివైపు వెళ్తున్న టీడీపీ, జనసేన శ్రేణులను పోలీస్‌స్టేషన్ ముందు అడ్డుకున్నారు. దీంతో వారు స్టేషన్ ముందు బైఠాయించి సుమారు రెండు గంటల పాటు ధర్నా చేశారు. ఎమ్మెల్యేను తంబళ్లపల్లె నుంచి పంపించివేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు ఎంతకూ టీడీపీ నాయకులకు అడ్డు తీయకపోవడంతో సహనం నశించిన వారు అక్కడి నుంచి మరికొంత దూరం ముందుకు దూసుకువెళ్లారు. ఈలోగా సంఘటనా స్థలానికి డీఎస్పీ ప్రసాదరెడ్డి చేరుకుని టీడీపీ నేతలు శాంతించాలని ఎమ్మెల్యేను ఇక్కడి నుంచి పంపించేస్తామని సర్ది చెప్పారు. ఎమ్మెల్యేను తంబళ్లపల్లె నుంచి పంపించే వరకు ఆందోళన విరమించేది లేదని అధికారంలో ఉన్నపుడు వైసీపీ నేతలు చేసిన అక్రమాలు, మాపై పెట్టిన తప్పుడు కేసులు, దౌర్జన్యాలు మీకు కనిపించలేదా అంటూ టీడీపీ నేతలు పోలీసులను నిలదీశారు. ఇప్పుడు కూడా మాపై దాడి చేసేందుకు పుంగనూరు, తమిళనాడు నుంచి వాహనాలలో రౌడీలను పిలిపించారని, ప్రశాంతంగా ఉన్న తంబళ్లపల్లెలో మళ్లీ గొడవలు సృష్టించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు వారిని పంపించి వేయకుండా తమనే అడ్డుకోవడంపై టీడీపీ నాయకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా పోలీసులు వైసీపీ ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారంటూ మండిపడ్డారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద వందలాది మంది రౌడీలు కత్తులు, కట్టెలు పట్టుకుని ఉన్నా పోలీసులు అక్కడికి ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీ ఎత్తున వైసీపీ శ్రేణులు మోహరించి ఉండటంతో పరిస్థితి ఎక్కడ చేయిదాటుతుందేమోనని పోలీసులు ఆందోళనకు గురయ్యారు. చివరికి ఎమ్మెల్యేను తంబళ్లపల్లె నుంచి పంపించి వేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో శాంతించి టీడీపీ నేతలు ఆందోళన విరమించారు.


డీఎస్పీ ప్రసాదరెడ్డితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సింహవాహనంపై మత్స్యావతారంలో సౌమ్యనాథుడు


గ్రామోత్సవంలో సింహవాహనంపై సౌమ్యనాథుడు

నందలూరు, జూలై 16: నందలూరు సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సింహవాహనంపై సౌమ్యనాథస్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, తిరుమంజనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మృగరాజు అయిన సింహ వాహనంపై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని గోవింద నామ స్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం ఉదయం పల్లకిసేవ, తిరుమంజనం, రాత్రి హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సర్వజన ఆసుపత్రిలో... భద్రత ఏదీ..!

- నామమాత్రంగా భద్రతా సిబ్బంది
- అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- గస్తీని గాలికొదిలేసిన పోలీసులు
- దొంగలకు, తాగుబోతులకు అడ్డాగా మారుతున్న వైనం

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో భద్రత కొరవడింది. ఇక్కడ తగినంత మంది భద్రతా సిబ్బంది లేక పోవడం.. పోలీసుల నిఘా కొరవడటం... ఇక ఆసుపత్రిలో.. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారడంతో పెద్దాసుపత్రి దొంగలు, తాగుబోతులకు అడ్డాగా మారింది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులు ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనల మధ్య గడుపుతున్నారు. ఇక కొంద రు ప్రేమికులు సైతం ఆసుపత్రిని.. ఆసుపత్రి పరిసరాలను తమ ఏకాంతం కోసం వినియోగించుకుంటున్నారు.

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 16: కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్ద సర్వజన ఆసుపత్రితో పాటు దంత వైద్యకళాశాల, వైద్యకళాశాల, రిమ్స్, నర్సింగ్ కళాశాల, మేల్, ఫీమేల్ విద్యార్థుల హాస్టళ్లు, ఔషధాలకు సంబంధించిన బిల్డింగ్, వైద్యుల నివాసాల క్వార్టర్లు ఉన్నాయి. గత సంవత్సరం కొత్తగా సూపర్ స్పెషాలిటీ, మెంటల్ మరియు క్యాన్సర్ కేర్ ఆసుపత్రులు అదనంగా ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ సర్వజన ఆసుపత్రిలో సుమారు 1500 నుంచి 1700 వరకు ఓపీ ఉంటుంది. ఇక ఇన్‌పేషంట్లు, పేషంట్ల బంధువులు, ఆసుపత్రి విధుల నర్సులు, సిబ్బంది ఇలా అనేక మంది నిత్యం ఇక్కడ ఉంటారు. ఇలాంటి చోట భద్రతా సిబ్బంది కేవలం 150 మంది మాత్రమే ఉన్నారు. వీరికి రోజులో మూడు షిఫ్టులు. అంటే అందరూ ఒకేసారి డ్యూటీ చేయడానికి వీలు పడదు. ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సర్వజన ఆసుపత్రి, దంత వైద్యకళాశాల, వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీ, మెంటల్, క్యాన్సర్ కేర్ మరియు ఆసుపత్రివార్డుల వద్ద విధులు నిర్వహిస్తుంటారు.

భద్రతా సిబ్బంది ఇతర పనుల్లో...

సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది భద్రతను గాలికొదిలేసి ఆసుపత్రి ఉన్నతాధికారుల క్యారీలను మోయడం, రోగుల వీల్‌ఛైర్లు తీసుకెళ్లడం, ఫార్మసీ మందులు వార్డుల్లోకి తీసుకెళ్లడం వంటివి చేస్తుంటారు. అసలే అరకొరగా ఉన్న భద్రతా సిబ్బందిని వేరే పనులకు పురమాయించడంతో దొంగలకు తమ చేతివాటం ప్రదర్శించడానికి సులువు అవుతోంది. మరికొంత మంది ఉన్నతాధికారులు సెక్యూరిటీ సిబ్బందిని తమ సొంత అవసరాలకు ఇళ్లకు తీసుకెళ్లి మరీ పనిచేయించుకుంటున్నారు. కొందరు ఉన్నతాధికారులు అయితే అవసరం లేకున్నా ఆర్భాటం కోసం సెక్యూరిటీ సిబ్బందిని తమ వెంటేసుకుని నిత్యం తిరుగుతుంటారు. ఆసుపత్రిలో ఏ అవసరం వచ్చినా వెంటనే గుర్తుకు వచ్చేది సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే.

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మొన్నటి వరకు 36 సీసీ కెమెరాలు ఉండేవి. కొద్దిరోజుల క్రితం ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకుని అదనంగా 64 కెమెరాలను కలిపి వంద కెమెరాలు ఏర్పాటు చేయించారు. కెమెరాల ఏర్పాటు బాగానే ఉన్నప్పటికీ అవి ఎప్పుడు పనిచేస్తాయో లేదో ఎవరికీ తెలియదు. ప్రధాన ద్వారం వద్ద అయితే సీసీ కెమెరాలు ఉన్నాయే కానీ వాటికి కనెక్షన్ మాత్రం లేదు. మరికొన్ని చోట్ల చెట్ల మధ్యలో చెట్ల కొమ్మలతో నిండకుని ఉన్నాయి. దీంతో దొంగలు యథేచ్ఛగా ఆసుపత్రిలో తిరుగుతున్నారు.



తాగుబోతులు, దొంగలు, జులాయిలకు అన్నీ ఫ్రీ

సర్వజన ఆసుపత్రిలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో నిత్యం ఎవరో ఒకరు వచ్చి ఆహారం ఉచితంగా అందిస్తుంటారు. రోగుల బంధువులమని చెప్పి వార్డుల వద్ద.. బయట పడుకుంటారు. ఇక నీళ్లు, బాత్‌రూములు అన్నీ ఫ్రీగానే లభిస్తాయి. శనివారం ఒక తాగుబోతు ఆసుపత్రికి వచ్చిన ఓ రోగితో అసభ్యంగా ప్రవర్తిస్తే సెక్యూరిటీ సిబ్బంది మందలించి పంపించివేశారు. సినిమాల్లో మాదిరిగా ఫేక్‌గా బ్యాండేజీలు చుట్టుకుని ఆసుపత్రిలోనే నిత్యం తిరుగుతుంటారు దొంగలు. కట్లు కట్టుకుని ఉండడం వల్ల రోగి అని భ్రమపడుతుంటారు. దీంతో దొంగలు వార్డుల్లోకి వెళ్లి రోగుల వస్తువులు, డబ్బులు కొట్టేస్తున్నారు. పుట్టిన బిడ్డల అపహరణ సైతం ఇలాంటి వారి వల్లనే జరుగుతోంది. రోగులు ఎవరో రోగి వెంట వచ్చే బంధువులు ఎవరో నిఘా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ, గస్తీ లోపం

ఆసుపత్రి వార్డుల్లో తనిఖీలు, వార్డు బయట మరియు ఆసుపత్రి పరిసరాల్లో నిద్రించేవారిపై పర్యవేక్షణ లేకపోవడం, ఎవరంటే వారు వార్డుల్లోకి ప్రవేశించడం రాత్రిపూట పోలీసు గస్తీ లేకపోవడం వల్ల దొంగలకు అడ్డాగా మారిపోయింది. బైకుల దొంగతనాలకు సులువైన ప్రదేశంగా ఆసుపత్రిని చేసుకుంటున్నారు. ఇక యువజంటలు, ప్రేమికులు సైతం ఆసుపత్రిని.. ఆసుపత్రి పరిసరాలు తమ ఏకాంతం కోసం వినియోగించుకుంటున్నారు.

రోగుల భద్రతకు చర్యలు తీసుకుంటాం...

జిల్లాలోనే పెద్దాసుపత్రి కావడంతో నిత్యం వేలాది మంది ఇక్కడకు వస్తూ పోతుంటారు. రోగుల భద్రతకు అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎవరైనా అనుమానాస్పదంగా వార్డుల్లో తిరిగినా వెంటనే సిబ్బందికి తెలిపితే చర్యలు తీసుకుంటాం. రాత్రివేళ తాగుబోతులు, జులాయిల బెడద ఉంది. పోలీసులు అటువంటి వారిపై కఠినంగా చర్యలు చేపట్టాలి. బైకుల చోరీలు కూడా జరుగుతున్నాయి. రోగులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపడతాం. రోగుల వైద్యంతో పాటు భద్రత కూడా ముఖ్యం.

- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంవో, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప



ఆఫీసు పని చేస్తూ.. క్యారీయర్‌లు మోస్తూ.. రోగుల సేవల్లో భద్రతా సిబ్బంది

ఉత్కంఠగా హాకీ పోటీలు



పులివెందుల రూరల్, జూలై 16: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 హాకీ పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పోటీలలో ఉమెన్స్ విభాగంలో కర్ణాటక-కేరళ జట్ల మధ్య జరగ్గా కర్ణాటక జట్టు 5గోల్స్ వేసి విజ యం సాధించింది. అలాగే తెలంగాణ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 గోల్స్ వేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 గోల్స్ వేసి ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించా యి. అలాగే మెన్స్ విభాగంలో తెలంగాణ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 గోల్స్ వేసిన తెలంగాణ, కర్ణాటక-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 గోల్స్ వేసిన కర్ణాటక, తమిళనాడు-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 గోల్స్ వేసిన తమిళనాడు జట్లు విజయం సాధించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.

దోమల నివారణకు సహకరించండి



నీటి నిల్వల్లో లార్వాను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, జూలై 16: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉం చుకొని దోమల నివారణకు సహకరించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. మంగళవారం తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఇళ్ల పరిసరాలను, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అపరిశుభ్ర వాతావరణంలో, నీటి నిల్వ ప్రాంతాలలో దోమలు గుడ్లుపెడతాయన్నారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. డ్రైడేపై అవగాహన కల్పించారు. దోమల వలన ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని ఆమె వివరించారు. సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఎంపీహెచ్ఈఓ శంకర్‌రెడ్డి, సూపర్వైజర్ శశికళ, సీహెచ్ఓ సోమేశ్వరి,ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోర్ బాల్ జట్టు కెప్టెన్‌గా తేజేంద్ర



వేంపల్లె, జూలై 16: వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాచవీటి తేజేంద్ర ఆంధ్ర జట్టులో గోల్‌కీపర్ మరియు జట్టు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఏపీ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జోషినాథ్, కడప జిల్లా ఫ్లోర్ బాల్ సెక్రటరీ మనోహర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జాతీయస్థాయి ఎంపిక పోటీలు జరిగాయన్నారు. అందులో తేజేంద్ర సత్తా చాటారన్నారు. ఈనెల 18, 19, 20 తేదీలలో హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరగబోయే జాతీయ స్థాయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన పండిత్, గోవింద్‌యాదవ్

రైల్వేకోడూరు, జూలై 16: మండలంలోని అనంతరాజుపేట సమీపంలో మంగళవారం మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.... అనంతరాజుపేట నుంచి మంగంపేటకు యువకులు పండిత్, గోవింద్‌యాదవ్‌లు మోటారు సైకిల్‌లో వెళుతుండగా... అదే సమయంలో హైద్రాబాద్ నుంచి తిరుమలకు వెళుతున్న కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరు ఇళ్లకు పీఓపీ పనులు చేస్తారు. సమాచారం తెలిసిన బ్లూకోల్ట్స్ సిబ్బంది స్థానికుల సహకారంతో 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

వాహనం ఢీ... గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపవరం, జూలై 16 : నెల్లూరు-బద్వేలు ప్రధాన రహదారిపై శ్రీనివాసపురం సమీ పంలో సోమవారం అర్ధరాత్రి వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు ఉండవచ్చని, అతను చుట్టుపక్కల ఉన్న హోటళ్ల వద్ద యాచిస్తూ కడుపు నింపుకునేవాడు. ప్రస్తుతం అతని మృతదేహం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉందని, అతని ఆచూకీ తెలిస్తే.. తమను సంప్రదించాలని బద్వేలు రూరల్ ఎస్ఐ తెలిపారు.

నూనెతో దాడిచేసిన వ్యక్తి అరెస్టు

ఒంటిమిట్ట, జూలై 16 : మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో ప్రభాకర్ అనే దళిత వ్యక్తిపై నూనెతో దాడి చేసి గాయపరిచిన గజ్జల చిన్నపోలు వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తిని మంగళవారం సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. సీఐ వివరాల మేరకు... ఈనెల 12న సాయంత్రం మద్యం మత్తులో ప్రభాకర్ గ్రామంలోని ఓ దుకాణం వద్ద అరుపులు, కేకలు వేస్తూ అరుగుపై పడుకోవడంతో అదే గ్రామానికి చెందిన గజ్జల చిన్నపోలు వెంకట సుబ్బారెడ్డి కట్టెతో దాడి చేసి.. పక్కనే ఉన్న వేడి నూనెను పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు.. పోలీసులు విచారించి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం స్థానిక కోదండ రామాలయ కల్యాణ వేదిక ప్రాం తంలో వెంటసుబ్బారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. ఈనెల 30 వరకు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు



కడప (క్రైం), జూలై 16: లంకమల్ల రిజర్వు అటవీప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న పెరుగు కొండయ్య అనే స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎర్రచందనం నిఘా విభాగం, కడప డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురుప్రభాకర్ ఆధ్వర్యంలో కడప ఫారెస్టు రేంజ్ ఆఫీసరు నయీం ఆలీ, నాగరాజులతో కాపుకాచి ఖాజీపేట మండలాలం నాగసానిపల్లె గ్రామానికి చెం దిన కొండయ్యను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఏడు దుంగలు స్వాధీ నం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు తప్పించుకుని పారిపోయారని.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎఫ్ఓ తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఖాజారహ్మతుల్లా, శోభారాణి, బాలచెన్నయ్య, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

కువైత్‌లో గుండెపోటుతో చంచర్లపల్లె వాసి మృతి



నాగేశ్వర (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, జూలై 16: మండలంలోని చంచర్లపల్లెకు చెందిన నాగేశ్వర (50) అనే వ్యక్తి కువైత్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుడి భార్య దేవి తెలిపారు. నాగేశ్వర బతుకుదెరువు కోసం 15 సంవత్సరాల కిందట కువైత్‌కు వెళ్లాడని సోమవారం ఉదయాన్నే కువైత్ నుంచి తన భర్త గుండెపోటుతో చనిపోయినట్లు ఫోన్ వచ్చిందని ఆమె విలపిస్తూ తెలిపింది. మృతుడు చాగలగుట్టపల్లెకు చెందిన వ్యక్తి దేవిని వివాహం చేసుకుని చంచర్లపల్లెలో స్థిరపడ్డారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం కాగా చిన్నకుమార్తెకు ఆగస్టు 24వ తేదీ పెళ్లి నిశ్చయించారని మృతుడి భార్య తెలిపింది. కువైత్‌కు వెళ్లినా ఏమీ సంపాదించలేదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కోరారు.

రేపటి నుంచి కుష్ఠు నిర్ధారణ పరీక్షలు : డీఎంఅండ్‌హెచ్‌ఓ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూలై 16 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటా కుష్ఠు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ రవిబాబుతో కలసి పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య నోడల్ అధికారులకు జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ జిల్లాను కుష్ఠు రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో జాతీయ కుష్ఠు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గృహాల్లో ప్రతి ఒక్కరిని పరీక్షించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెరుగైన చికిత్సకు రెఫర్ చేయాలన్నారు. వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయితే మందులు ఆరు నెలల లేదా సంవత్సరం పాటు ఉచితంగా ఇస్తారన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ వసతి గృహాల్లో ప్రతి విద్యార్థికి ఎల్‌సీడీసీ పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో పిజియోథెరపిస్టు, పాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం, జూలై 16 : వృద్ధురాలు గడ్డమీద బాలనాగమ్మ హత్య కేసులో నిందితుని బనగాని జయచంద్రుడును అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. హత్య జరిగి 24 గంటలలోపే నిందితుడు జయచంద్రుడుని అరెస్టు చేసినట్లు తెలియజేశారు. వివరాల మేరకు.. బాలనాగమ్మ భర్త రామయ్య, కుమారుడు సురేష్‌తో కలిసి నేతాజీనగర్‌లో కాపురముంటున్నారు. తన కుమారుడు సురేష్ తాను ప్రేమించిన ఉష నాగమనీష గురించివారికి తెలిపాడు. ఈ వివాహం జయచంద్రుడుకు ఇష్టం లేకపోవడంతో ఆ కుటుంబంపై పగ పెంచుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే సోమవారం మధ్యాహ్నం సుమారు 3.45 గంటల సమయంలో జయచంద్రుడు పెట్రోల్ బాటిల్‌తో స్వగ్రామం ఊటుకూరు నుంచి మోటారు సైకిల్‌పై ప్రొద్దుటూరుకు వచ్చాడు. నేతాజీనగర్‌లో ఉంటు న్న బాలనాగమ్మ ఇంటికి వచ్చి, అమెపై పెట్రోలు పోసి నిప్పంటించడంతో మృతి చెందిందని తెలిపారు. బాలనాగమ్మ కుమారుడు సురేష్ తన ఇష్టానికి వ్యతిరేకంగా కుమార్తెను పెళ్లి చేసుకున్నాడని, ఈ పెళ్లి బాలనాగమ్మ దగ్గరుండి చేయించినందున కక్ష కట్టి చంపిటనట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి అచూకీ కోసం ఎస్ఐ మంజునాథ్, సిబ్బందిని సికె దిన్నె మండలం ఊటూకూరు గ్రామంలోకి వెళ్లి సదరు హత్య చేసిన ముద్దాయి జయచంద్రుడుని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపినట్లు డిఎస్పీ చెప్పారు. గంటల వ్యవధిలోనే కేసు చేధించి ముద్దాయి అరెస్టు చేసిన సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్, హెడ్‌కానిస్టేబుల్స్ జగన్ నాయక్, రహంతుల్లా, జగన్నాథరెడ్డి, తిరుపాలయ్య, కానిస్టేబుళ్లను అధినందిస్తూ, వీరికి తగు రిపోర్టులకు సిపారసు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీలో అతిసార

ఒకే కుటుంబంలో ఆరుగురు బాధితులు



వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న బాధితులు

వేంపల్లె, జూలై 16: మండలంలోని కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీలో అతిసారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పదిరోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఆరుగురు అతిసారకు గురై ఆసుపత్రి పాలయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో ఆ కుటుంబం చికిత్స పొందుతోంది. ఆ గ్రామంలో ఇతరులు అతిసారకు గురయ్యారు. మండలంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేంపల్లె వైద్యశాలకు అతిసారతో బాధపడుతున్న రోగులు వస్తుండడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పేదల భూములకు భద్రత కల్పించండి : ఆర్డీవో


అట్లూరు, జూలై 16 : మండలంలోని నల్లాయపల్లె రెవెన్యూ గ్రామ పొలంలోని సర్వే నెం.180, 102, 41లలో ముంపు గ్రామాలైన పాటిమీదపల్లె, మలినేనిపట్నం గ్రామ స్తులకు 28 మందికి 42 ఎకరాలు పట్టాలు ఇచ్చారు. ఈ భూములను సాగు చేసుకుంటుండగా బద్వేలు మండలం గొడుగునూరు బోయినపల్లె వైసీపీ నేత శివరాంరెడ్డి, రవికుమార్‌రెడ్డిలు మరికొందరు మమ్మల్ని అడ్డుకుంటూ మాపై దాడి చేసేందుకు వచ్చారని రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ మంగళవారం నల్లాయపల్లె భూములను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేసి పట్టాదారులకు భద్రత కల్పించాలని తహసీల్దారు వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్, మండల సర్వేయరు శ్రీనివాసులుకు ఆదేశించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడితే వారికి నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేయాలని రెవె న్యూ అధికారులకు, ఎస్ఐ కేసీరాజుకు ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా, సర్వేయర్లు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

435 నిమ్మ చెట్లను నరికివేసిన వైసీపీ నేత




పొలంలో నరికిన నిమ్మచెట్లను చూపుతున్న బాధితులు

రాజంపేట టౌన్, జూలై 16 : రాజంపేట మండలం పోలి గ్రామ పంచాయతీలో వైసీపీ నాయకుడు పోలి చంద్రారెడ్డి కొంతమందితో కలిసి సోమవారం రాత్రి తోటలో ప్రవేశించి 435 నిమ్మచెట్లను నరికివేశారు. వివరాల్లోకి వెళితే... మునక్కాయల మంజుల 8 సంవత్సరాల నుంచి నిమ్మతోటను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పోలి చంద్రారెడ్డి అనే వైసీపీ నాయకుడు పోలి పంచాయతీలోని సర్వేనెంబరు 1033/3 నెంబరులో ఉన్న ఐదెకరాల పొలం తనదంటూ తప్పుడు పత్రాలు సృష్టించి రెండు సంవత్సరాల నుంచి ఆ భూమి తనదంటూ దౌర్జన్యం చేయడంతో పాటు అనేకసార్లు తమపై దాడికి కూడా పాల్పడ్డారని బాధితురాలు తెలిపారు. దీనిపై కోర్టులో సమస్య ఉన్నప్పటికీ తమపై దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపింది. సోమవారం రాత్రి ఎవరూ లేని సమయంలో చంద్రారెడ్డి కొంతమంది మనుషులతో కలిసి రెండు సంవత్సరాల వయస్సు ఉన్న నిమ్మ చెట్లను నరికివేశాడని, ఉదయం తోటలోకి వెళ్లి చూసి రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మన్నూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.













త్యాగానికి ప్రతీక మొహర్రం



ఓబిలిలో ఊరేగుతున్న హసన్, హుస్సేన్ పీర్లు



పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు



బోరెడ్డిగారిపల్లెలో కొలువుతీరిన పీర్లు

గాలివీడు, జూలై 16: ధర్మ పరిరక్షణకు, త్యాగానికి ప్రతీకగా మొహరం నిలుస్తుందని పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ తెలిపారు. మొహరం పండుగ సందర్భంగా మంగళ వారం బోరెడ్డి గారిపల్లెలో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం మానవాళికి దివ్య సందేశాన్ని అందిస్తోందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఇమామ్ జీవితం వర్తమాన సమాజానికి ఆదర్శ ప్రాయమన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే పీర్ల ఊరేగింపు ప్రజల మధ్య సఖ్యతను, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. భగవంతుడి ద యవల్ల ప్రజలందరూ సుఖసంతోషాల తో విరాజిల్లాలని, వర్షాలు సంవృద్ధిగా కురిసి పంట పొలాలతో సస్య శ్యామలంగా ఉండాలని, మత సామరస్యం వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

వైభవంగా చిన్న సరిగెత్తు

పెనగలూరు: పి.కొత్తపల్లెలోని పీర్ల చావడి నుంచి అటల్ సాహెబ్ బాదుల్లా వెండి పీర్ల ను కొత్తపల్లె, నాగిరెడ్డిపల్లె, పెనగలూరు, వినాయక నగర్, బస్టాండ్ కూడలి, ముస్లిం కాలనీ, సాతపల్లె రహదారిలో ఊరే గించారు. కొత్తపల్లె నుంచి పి.కొత్తపల్లె వరకు నూర్ బాషా దూదేకుల సంఘం సభ్యులు సాహిత్యాలను పి.కొత్తపల్లె వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పానకం దుత్తలు, గంధం బాసికాలతో ఊరేగింపుగా వచ్చారు. ఓబిలిలో అస్సాం హుస్సేన్, నల్లపురెడ్డిపల్లెలో గంధం పీర్లను గ్రామాల్లో ఊరేగించారు.

రైల్వేకోడూరు: మండలంలోని రెడ్డివారిపల్లె, తురకపల్లె, శెట్టిగుంట, రాఘవరాజ పురం, చిట్వేలి మండలంలోని నేతివారిపల్లె, నరిగి పాడు, చిట్వేలి, పెనగలూరు మండలంలోని పి. కొత్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, చక్రంపేట, ఓబులవారిపల్లె మండలంలో రాళ్లచెరువుపల్లె, పెద్ద ఓరంపాడు, చిన్నఓరంపాడు, ఓబులవారిపల్లె, చెన్నరాజుపోడు, వై.కోట, నూకనపల్లె, పుల్లం పేట మండలంలో అప్పారాజుపేట, దళవాయి ఎల్లె, కేతరాజుపల్లె, కృష్ణం పల్లె, కోనయ్యగారి పల్లె తదితర గ్రామాల్లో పీర్ల పండుగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

వీరబల్లి: మండలంలోని ఈడి గపల్లిలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిగుండం కార్యక్రమానికి రాజంపేట టీడీపీ నియోజకవర్గ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం విచ్చేశారు. పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. మండల టీడీపీ నాయకులు వై.రెడ్డెప్పరెడ్డి, కల్లూరి రాంమోహన్‌రెడ్డి, సురేంద్రారెడ్డి, బీజేపీ నరేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని బండపల్లి, రాచపల్లి, మననాపురం, దూదేకులపల్లి, కుమ్మరపల్లిలో మొహరం సందర్భంగా పీర్లను నిలిపారు. బుధవారం సాయంత్రం పీర్లను ఊరేగించిన అనంతరం నిమజ్జనం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పూలచాదర్ సమర్పించిన పోలీసులు

చిన్నమండెం: మండల కేంద్రంలోని మకాన్‌లో



గంగనేరులో ఏర్పాటు చేసిన పీర్లు

ఏర్పాటు చేసిన పీర్లకు పోలీస్‌స్టేషన్ తరపున పూల చాందిరీ సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది రాయచోటి రూరల్ ఇన్‌చార్జి సీఐ భాస్కర్, ఎస్ఐ రమేశ్‌బాబు మంగళ వాయిద్యాల నడుమ పూలచాందిరీని మోసుకుంటూ మకాన్ వరకు ఊరేగింపుగా వెళ్లి గంధపు పీరుకు చాందినీ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, కడప పెద్దదర్గా గురువు హుసేనీ అరీఫుల్లా సందర్శించి ప్రార్థనలు చేశారు. పూల చాదర్ సమర్పించారు.

రాయచోటిటౌన్: ధర్మపరిక్షణకు, త్యాగానికి ప్రతీక మొహరం పండుగ అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే పీర్ల ఊరేగింపు ప్రజల మధ్య సఖ్యతను, ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

చీనీ చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● బాధిత రైతులకు సుగవాసి పరామర్శ

రాజంపేట, జూలై 16 : చీనీ చెట్లు నరికివేయడంతో నష్టపోయిన రైతులను రాజంపేట మండలం పోలి గ్రామంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పరామర్శించారు. బాధితులతో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారికి జరిగిన అన్యాయాన్ని పోలీసు దృష్టికి తెచ్చారు. చెట్లను నరికివేసిన వైసీపీకి చెందిన నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకా నరసింహులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, గీతాంజలి కళాశాల కస్పాండెంట్ ఎస్‌వి రమణ, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గంప శివ, జిల్లా బలిజ యువసేన అధ్యక్షుడు టైల్స్ నరసింహ, చెంగల్‌రాయుడు, ఊటుకూరు మలిశెట్టి సుబ్బరాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో బాల సుబ్రమణ్యం

నందలూరు : బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం సౌమ్యనాథస్వామి ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి శాలువాలతో సన్మానం చేసి స్వామివారి చిత్రపటాలను ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, సమ్మెట శివప్రసాద్, ఎద్దల విజయసాగర్, గీతాంజలి కళాశాల కరస్పాండెంట్ ఎస్వీ రమణ, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, రాజంపేట మండల టీడీపీ నాయకులు గంప శివ, ఎర్రబెల్లి టీడీపీ నాయకులు నాగరాజు, ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఆకుల చలపతి, చామంచి పెంచలయ్య, సయ్యద్ అమీర్, తాటి సుబ్బరాయుడు, గణపతి, కానకుర్తి వెంకటయ్య, మహబూబ్‌బాషా, రెడ్డయ్య, కుర్రా మణి, సురేష్, గంగాధర్, జ్యోతి, శివ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత రైతులతో పోలీసు స్టేషన్‌లో సుగవాసి బాలసుబ్రమణ్యం

గంబూషియా చేపలతో దోమల నివారణ

సంబేపల్లె, జూలై 16: గంబూషియా చేపలతో దోమల లార్వా నివారణ ద్వారా డెంగ్యూను అరికట్టడం సాధ్యమని సంబేపల్లె ప్రాథమిక వైద్యాధికారులు మడితాటి మధుసూదన్‌రెడ్డి, అంకం సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పాండురాజులబండ వద్ద మురుగు నీటిలో గంబూషియా చేపలు వదిలారు. ఈ చేపలు దోమల లార్వాలను తినేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం ద్వారా దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రాత్రి సమయంలో దోమ తెరలు వాడాలని తెలియ జేశారు. జ్వరాలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. జ్వరం సోకిన వెంటనే దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి వైద్యుల సలహా మేరకు పరీక్షలు చేయించుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్, జయరామయ్య, ఎల్‌టీ నాగరాజు, అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశావర్కర్ పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారులు

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

రామాపురం, జూలై 16: అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె బ్రిడ్జి వద్ద వంకలో మంగళ వారం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పయ్యరాజుపేటలో పారిశుధ్య పనులు

పుల్లంపేట, జూలై 16 : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట పంచాయతీలో మంగళ వారం పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వీధుల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని పిచ్చిమొక్కలను తొలగించారు. అంటువ్యాధులు ప్రబలకుండా వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్యదర్శి గ్రామస్థులకు సూచించారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 16: అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠ శాలలో చేర్పించాలని సీడీపీవో పద్మావతి ఆదేశించారు. సెంటర్లలోని 10 మంది చిన్నారులను మంగళవారం వివిధ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాప ఫుట్స్ తగ్గించాలని, బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో బాలికల శాతాన్ని పెంచాలన్నారు. బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సూపర్‌వైజర్లు దాద్‌బీ, తులసమ్మ, సోనీ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, రుక్మిణి, రత్నమ్మ, షాహీనా పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మంత్రి ఫిర్యాదుతో కదలిన రెవెన్యూ యంత్రాంగం

● ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

చిన్నమండెం, జూలై 16: వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది చిన్నమండెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1095లో 5.64 ఎకరాలు, సర్వే నెంబర్ 184/7లో 2.5 ఎకరాలు, సర్వే నెంబర్ 313లో 68 సెంట్లు, వండాడి గ్రామ పంచాయతీలోని 118 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల్లో ఎవరైనా ప్రశ్నిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

విషగుళికలు కలిపిన నీళ్లు తాగి ఆవు మృతి

● ప్రాణాపాయ స్థితిలో మరో రెండు ఆవులు

వీరబల్లి, జూలై 16: మండలంలోని ఈడిగపల్లిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు విషగుళికలు నీటిలో కలపడంతో ఒక ఆవు మృతి చెందగా.. మరో రెండు ఆవుల పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆవులు తాగే నీటి తొట్లలో విషగుళికలు కలిపారు. ఈ విషయం తెలియని రైతు జెడ్పీ శివరాంగౌడ్ ఆవులను నీటిని తాపడం కోసం తొట్ల వద్దకు వదిలారు. అనంతరం పాల పితకడానికి వెళ్లగా ఒక ఆవు ఇబ్బందులు పడుతూ మృతి చెందింది. ఆవు ఎందుకు మృతి చెందింది అని ఆరా తీయగా నీటి తొట్లలో విషపు గుళికలు ఉండడం గమనించారు. మరో రెండు ఆవుల పరిస్థితిని పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలపడంతో వారు చికిత్స చేశారు. మృతి చెందిన ఆవు రూ.85 వేలు చేస్తుందని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

అంగన్వాడీ టీచర్‌పై విచారణ

చిన్నమండెం, జూలై16: నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఓ మహిళ అంగన్వాడీ టీచర్‌గా ఉద్యోగం పొందిందని మంగళవారం కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు అందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వండాడి గ్రామ పంచాయతీ ఎర్రగుట్లవాళ్లపల్లెకు చెందిన అంగన్వాడీ టీచర్ నకిలీ పేరుతో సర్టిఫికెట్లు పొంది ఉద్యోగం చేస్తోందని ఆమెపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. దీంతో సూపర్‌వైజర్ పవన్‌కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె చదువుకున్న కళాశాల, పాఠశాలలకు సర్టిఫికెట్లను వెరిఫికేషన్‌కు పంపించామని, ఆరోపణలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని సీడీపీవో తెలిపారు.

జగన్‌మోహన్‌రాజుతో ఒంటిమిట్ట నేతల భేటీ



చమర్తి జగన్‌మోహన్‌రాజుతో ఒంటిమిట్ట నేతలు

రాజంపేట, జూలై 16 : రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజును మంగళవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో కల్లుగీత కార్పొరేష న్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, ఒంటిమిట్ట మండల టీ డీపీ నాయకులు మోదుగుల నర సింహులు, రఘురామిరెడ్డి, మామి ళ్ల హరి, ఈశ్వరయ్య, చంద్రబాబు, పామూరు సుబ్రమణ్యం తదితరు లు కలిసి మండల సమస్యలను వివరించారు. మండలంలోని అధికారులు వైసీపీ ప్రభుత్వం భ్రమలోనే ఉన్నారని, వారు ప్రజా సమస్యలను పరిష్కరించడంలేదని తెలిపారు. అధికారులను కలిసి ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటరమణ, వినోద్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రాజారెడ్డి, చాన్‌బాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై సీఎం ఖండన

రాజంపేట, జూలై 16 : రాజంపేట మండలం పోలి గ్రామంలో నిమ్మచెట్ల నరికివేతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్రంగా స్పందించారు. ఇటువంటి విష సంస్కృతిని సహించేది లేదని హెచ్చరించారు. తోటలను నరికివేయడం, పంట పొలాలు ధ్వంసం చేయడం లాంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీ రాజకీయాలకు విధ్వంస విధానాలకు పాల్పడేవారు తీరు మార్చుకోక పోతే మూల్యం చెల్లిస్తారని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డీజీపీని కలిసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై16: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును మంగళవారం విజయవాడలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలబొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రస్తుత లా అండ్ అర్డర్ పరిస్థి తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీని కోరారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి మండిపల్లి

నారా లోకేశ్‌ను కలిసిన ముస్తాక్‌హుస్సేన్

రాయచోటిటౌన్, జూలై 16: టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాయచోటి నియోజకవర్గ మైనార్టీ నేత అమరావతిలోని వెలగపూడి సెక్రటేరియట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలి యజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల విద్యాభివృద్ధికి, ఉర్దూ విద్యాభివృద్ధికి స హాయ సహకారాలు అందించాలని కోరారు. రాయచోటి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుతో పాటు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విన్నవించారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన యువత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొం డంత ఆశతో ఎదురు చూస్తోందని వారి ఆశలు సఫలమయ్యేలా చర్యలు తీసుకో వాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యో గులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, నూతన పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.



నారా లోకేశ్‌బాబుతో ముస్తాక్‌హుస్సేన్

పీలేరు నుంచి రాజంపేటకు ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్



బస్సుకు స్వాగతం పలికిన టీడీపీ, జనసేన నేతలు

రాజంపేట/సుండుపల్లె, జూలై 16: జిల్లాలోని పీలేరు నుంచి రాజం పేటకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. రాజంపేట అసెంబ్లీ జనసేన నేత రామా శ్రీనివాస్, రైతు సంఘం సేవా మిత్ర అధ్యక్షుడు సుబ్బరామరాజు ఆధ్వర్యంలో పీలేరు - రాజంపేటల మధ్య బస్సు సర్వీసును నడపాలని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్యకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. దీంతో పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, ఆ డిపో అధికారులు హరినాథ్ రెడ్డి, నరసింహారెడ్డి, హనీఫ్, రామకృష్ణ బస్సు ద్వారా రూటు సర్వే చేశారు. రాజంపేట డిపోకు చేరుకున్న బస్సుకు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. జనసేన లీగల్ సెల్ అధ్యక్షుడు కరుణాకర్‌రాజు, ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు వాణి, జనసేన నాయకులు గోపాల్, నూరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, జూలై 16: ఈ నెల 21వ తేదీ ఆదివారం జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి పీ. మహేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సీవీ ప్రసాద్, జగదీశ్ హాజరవు తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మహేశ్

డయేరియా నివారణపై దృష్టి సారించండి : డీపీవో

సిద్దవటం, జూలై 16 : డయేరియా నివారణపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. సిద్దవటం మండల అభివృద్ధి కార్యాలయ భవనంలో మంగళ వారం డయేరియా నివారణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రపరిచి నోటీసు బోర్డులో నమోదు చేయాలని, తాగునీటి శాంపిల్స్ సేకరించాలని సూచించారు. మండల పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్‌ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని తెలియజేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు, ఏపీవో నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



డయేరియా నివారణ చర్యలపై వివరిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

గుండెపోటుతో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ మృతి

ఓబులవారిపల్లె, జూలై 16 : మండలంలోని మంగంపేట గ్రామానికి చెందిన యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. గునిపాటి లక్ష్మీకాంత్ (34)అనే ఈయన ఏపీఎండీసీలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ ఉండేవారు. రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏపీఎండీసీ ఉద్యోగులు, గ్రామస్థులు, కార్మిక పోరాట సంఘాల నాయకుడు వెంకటేశ్ సంతాపం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

లక్కిరెడ్డిపల్లె జూలై 16: ఈ నెల 18 నుంచి 28 వరకు జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల జనసేన అధ్య క్షుడు రాహుల్ తెలిపారు. మండల వ్యాప్తంగా కార్యక్రమం వేగవంతం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్ జన సైనికులు హరి , చిన్నా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగంలోకి సీఐడీ !


తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో డీటీని విచారిస్తున్న సీఐడీ అధికారులు

తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో విచారణ

ఓటర్ల నమోదులో అక్రమాలపై ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు పర్యవసానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మంగళవారం విచారణ జరపడం కలకలం రేపింది.చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే పులివర్తి నానీ చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచీ అసంఖ్యాకంగా ఫిర్యాదులందాయి. కలెక్టర్ మొదలుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ దాకా ఫిర్యాదులు వెళ్ళాయి. తిరుపతి ఆర్డీవో నుంచీ కిందిస్థాయిలో బీఎల్వోల దాకా అధికారులు, సిబ్బంది అప్పటి అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దొంగ ఓట్లు భారీగా చేర్పించారని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆధారాలు కూడా జత చేశారు. అయితే ప్రభుత్వం వీటిపై స్పందించలేదు. ఎన్నికల సంఘం వివరణ కోరినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపుచ్చారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలు ముగిశాక ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీ మళ్ళీ దీనిపై ప్రభుత్వానికి, సీఐడీ విభాగానికీ ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి గూడూరు ఆర్డీవో మీసాల కిరణ్ కుమార్ ప్రమేయంపై ఆరోపణలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో అంటకాగారనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చాక ప్రభుత్వ విప్ హోదాలో చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు.తర్వాత గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూనే వారంలో ఐదు రోజుల పాటు తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో వున్న చెవిరెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో మకాం వేసేవారని, చంద్రగిరి పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లను, తిరుపతి ఆర్డీవోను అక్కడికి పిలిపించుకుని బోగస్ ఓటర్లను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్డీవో, తహసిల్దార్ల లాగిన్ల పాస్‌వర్డులు తీసుకుని బోగస్ ఓటర్లను చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల స్వాధీనం

ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు నేపథ్యంలో తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ మంజుల, సిబ్బంది మంగళవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. అయితే ఆ సమయానికి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కార్యాలయంలో లేరు. కార్యాలయ ఏవో, ఎన్నికల డీటీలను విచారించిన సీఐడీ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో కలెక్టరేట్‌కు వెళ్ళారని, సాయంత్రం వస్తారని సిబ్బంది చెప్పడంతో సీఐడీ అధికారులు మళ్ళీ సాయంత్రం కార్యాలయానికి వెళ్ళారు. అయితే అప్పుడు కూడా ఆర్డీవో లేరు. క్యాంపు వెళ్ళారని, బుధవారం సెలవు కనుక గురువారం అందుబాటులో వుంటారని సిబ్బంది చెప్పారు. దీంతో గత ఐదేళ్లలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన అధికారులు, డివిజన్ పరిధిలో పనిచేసిన తహసిల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, ఆర్డీవో, తహసిల్దారు కార్యాలయాల్లో పనిచేసిన ఎన్నికల సిబ్బంది ఎవరనే వివరాలు అందజేయాలని సీఐడీ అధికారులు కార్యాలయ ఏవోకు లేఖ అందజేశారు. చెవిరెడ్డి ఓఎస్డీగా కిరణ్‌కుమార్ తుడా వ్యవహారాల్లో ఏమైనా జోక్యం చేసుకున్నారా? నిధుల దుర్వినియోగంలో ఆయన ప్రమేయం ఏమైనా వుందా? అన్న కోణంలో విచారించేందుకు తుడా కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ తుడా వీసీ వెంకట నారాయణను విచారించారు. అయితే చెవిరెడ్డికి ప్రభుత్వ విప్ హోదాలో కిరణ్‌కుమార్ ఓఎస్డీగా పనిచేశారు తప్ప తుడాతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, తుడా వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఏమీ లేదని వీసీ సమాధానమిచ్చినట్టు తెలిసింది.


తుడా కార్యాలయంలో వీసీతో చర్చిస్తున్న సీఐడీ బృందం

రేపు తిరుపతి ఆర్డీవోను విచారించే అవకాశం?

తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి మంగళవారం అందుబాటులో లేకపోవడంతో గురువారం ఆయనను సీఐడీ అధికారులు విచారించే అవకాశం వుంది. అయితే గురువారం అయినా ఆయన అందుబాటులోకి వస్తారా లేదా? అందుబాటులోకి రాకుంటే సీఐడీ అధికారులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సి వుంది. కాగా చంద్రగిరి నియోజకవర్గంలో బోగస్ ఓటర్లను పెద్ద సంఖ్యలో చేర్పించారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారుల విచారణ మొదలు కావడంతో ఎన్నికల విధుల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు. తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందో, తమపై ఏం చర్యలు వుంటాయోనని ఆందోళనకు లోనవుతున్నారు.

టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారిగా సీహెచ్ వెంకయ్య చౌదరి నియమితులయ్యారు.2005వ సంవత్సరం బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారైన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన మూడేళ్ల పాటు ఏపీలో పనిచేయనున్నారు. గతంలో ఏపీ మినరల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా వెంకయ్య చౌదరి పనిచేశారు. సాధారణంగా టీటీడీకి ఈవోతో పాటు తిరుమలకు ఒకరు, తిరుపతికి ఒకరు చొప్పున ఇద్దరు జేఈవోలుంటారు. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఇద్దరు జేఈవోలను తిరుపతికే పరిమితం చేసి తిరుమలలో కేవలం ఈవోగా ధర్మారెడ్డిని మాత్రమే కొనసాగించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పూర్వపు పద్ధతిలోనే ఈవోతో పాటు తిరుమలకు జేఈవోను యధావిధిగా కొనసాగిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సమర్థవంతమైన అధికారిగా పేరున్న వెంకయ్య చౌదరి ఎంట్రీతో టీటీడీలో ఎలాంటి మార్పులు, ంటాయో చూడాల్సివుంది.

అంకెల గారడీ వద్దు... కొత్తవారిని గుర్తించి రుణాలివ్వండి

● బ్యాంకర్లకు కలెక్టర్ పిలుపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 16: లక్ష్యాలు పూర్తి చేశామంటూ చూపించే అంకెల గారడీ వద్దు.... రుణాల కోసం ఎదురుచూస్తున్న కొత్తవారిని గుర్తించి రుణాలు అందించి ఆదుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌సాగుకు సంబంధించి రైతులకు, కౌలు రైతులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ఐదు లక్షల మంది రైతులు ఉన్నారని, వీరికి సాగుతో పాటు విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువుల కొనుగోళ్ళకు అవసరమైన రుణపరపతిని అందించాలని హితవు పలికారు. వ్యవసాయంతో పాటు జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతోందని, పాడి పశువుల కొనుగోళ్ళకు సైతం విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. బ్యాంకర్ల సమావేశానికి ప్రతి బ్యాంకు తరపున జోనల్ మేనేజర్ లేదా రీజనల్ మేనేజర్లు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. ఎల్డీఎం హరీష్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యానికి మించి 106.62 శాతం రుణాలు బ్యాంకర్లు పంపిణీ చేశారని వివరించారు. ఎంఎస్ఎంఈకి సంబంధించి లక్ష్యాలకు మించి రుణాలు అందించామని పేర్కొన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం సునీల్, ఆర్బీఐ లీడ్ బ్యాంక్ ఆఫీసర్ నాగప్రదీప్, ఇండియన్ బ్యాంకు జెడ్ఎం బాలచంద్రమోహన్, ఇతర బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు, కోఆర్డినేటర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బ్యాంకర్లకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నేడు కేంద్రమంత్రి గడ్కరీ రాక

తిరుపతి (కలెక్టరేట్), జూలై 16: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ జాతీయ రహదారుల ప్రాజెక్టులపై అధికారులతో చర్చించనున్నారు. తర్వాత హెలికాప్టర్‌లో మదనపల్లి బయలుదేరుతారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొన్నాక రాత్రి తిరుమల చేరుకుంటారు. గురువారం వేకువజామున శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఢిల్లీ బయలుదేరుతారని కలెక్టర్ వివరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది.

కుప్పంలో రేపు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూలై 16: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లిగుండ్లపల్లెలో బెల్జియం విద్యార్థుల బృందం


బెల్జియం విద్యార్థులకు అన్నదానం చేస్తున్న గుణశేఖర్ నాయుడు

శ్రీరంగరాజపురం, జూలై 16: బెల్జియం దేశానికి చెందిన 27మంది విద్యార్థుల బృందం ఎస్ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లె ఎస్టీ కాలనీలో మంగళవారం పర్యటించింది. ప్రకృతి నుంచే వచ్చే వివిధ మూలికల గురించి, ఎస్టీ కాలనీ ప్రజల ఆహార అలవాట్లు, వారి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లిగుండ్లపల్లె గ్రామానికి చెందిన వాటర్ షెడ్ మాజీ చైర్మన్ గుణశేఖర్ నాయుడు, ఆయన కుమారుడు మోహన్ ప్రసాద్ బెల్జియం విద్యార్థులకు అన్నదానం చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సోషియల్ వర్కర్ సిద్దమ్మ భారతదేశ గ్రామీణ ప్రాంతాల గురించి వారికి వివరించారు.

లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు


నిందితుడు రామయ్య

పుత్తూరు అర్బన్, జూలై 16: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన సోమవారం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రామయ్య 2020 ఏప్రిల్ 20వ తేదీన ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్. శాంతి సోమవారం నిందితుడు రామయ్యకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసును స్పెషల్ పీపీ శైలజ బాధితుల తరఫున వాదించారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడడానికి కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ పట్టాభి, సబ్ డివిజన్ కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణమరాజును డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

ననియాల ఎలిఫెంట్ క్యాంపు సందర్శన


శిక్షణ పొందిన ఏనుగులను పరిశీలిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

రామకుప్పం, జూలై 16: రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంపును మంగళవారం అనంతపురం అటవీ రేంజ్ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు సందర్శించారు. ఎలిఫెంట్ క్యాంపుతో బాటూ, అక్కడి ఎకో టూరిజం పార్కును కూడా సందర్శించారు. ఏనుగుల సంరక్షణపై అక్కడి సిబ్బందికి సూచనలిచ్చారు. అదేవిధంగా వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణకు చేపట్టాల్సిన పనులపై స్థానిక అటవీ అధికారులతో చర్చించారు. స్థానికుల అభిప్రాయాలకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కుప్పం అటవీ రేంజ్ పరిధిలో జరుగుతున్న పనుల తీరుపై అధికారులతో సమీక్షించారు. అంతకుముందు కుప్పం మండలం నడుమూరు బేటరాయస్వామి కొండను ఆయన సందర్శించారు. అక్కడ ఎకో టూరిజం పార్కు ఏర్పాటుపై సీఎం పీఏ మనోహర్, స్థానిక టీడీపీ నేతలతో చర్చించారు. ఆయన వెంట డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీపీ సహా ఎంపీటీసీలెవరూ రాలేదు

● వచ్చింది నలుగురు సర్పంచులే.. వాయిదా పడ్డ పులిచెర్ల మండల మీట్

కల్లూరు, జూలై 16: జడ్పీటీసీ సహా నలుగురు ఎంపీటీసీలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన పులిచెర్ల మండల మీట్‌కు ఎంపీపీ సహా ఎంపీటీసీ సభ్యులెవరూ హాజరు కాలేదు. దీంతో సమావేశానికి ఎంపీడీవో సురేష్‌బాబు వాయిదా వేశారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, 8 మంది ఎంపీటీసీ సభ్యులు మండల సమావేశానికి హాజరుకాలేదు. సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, మునిరత్నం, కృష్ణయ్య రాగా.. మిగతా వాళ్లు గైర్హాజరయ్యారు. దీంతో సమావేశం ప్రారంభించాల్సిన సమయం ముగిసిపోవడంతో మండల మీట్ వాయిదా పడింది. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, ఏపీవో షౌకత్ అలీ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసీపీకి ముగ్గురు ఎంపీటీసీల రాజీనామా

కాగా, మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో 9 మంది వైసీపీ.. ఇద్దరు టీడీపీ సభ్యులు ఉన్నారు. దేవళంపేట ఎంపీటీసీ సురేంద్రనాధరెడ్డిని ఎంపీపీ పదవి వరించగా పులిచెర్ల, మంగళంపేట సభ్యులు ఈశ్వరి, రాశి వైస్ ఎంపీపీలుగా ఎంపికయ్యారు. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమితో మూడు రోజుల క్రితం నలుగురు ఎంపీటీసీలు వైసీపీకి రాజీనామా చేశారు. ఈ ప్రభావం మండల మీట్‌పై పడింది.


ప్రజాప్రతినిధులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

పుష్పపల్లకిలో మురిపించిన మలయప్ప

శ్రీరంగం సారె సమర్పణలో కొంత గందరగోళం



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరుమలలో పుష్పపల్లకి సేవ కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిసి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను స్వామివారి పల్లకి అలంకరణకు వినియోగించారు. కృత, త్రేతా, ద్వాపర యుగాలకు చెందిన వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు.కాగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తమిళనాడు దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీఈ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి శ్రీవారికి సమర్పించారు.కాగా సారెను ఆలయంలోకి తీసుకెళ్లే సమయంలో మహద్వారం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. తొలుత సారెతో పాటు పది మందికి అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో శ్రీవారి ఆలయ జీయర్‌స్వామి,మంత్రి శేఖర్ బాబుతో పాటు పదిమంది మహద్వారం గేటులోకి ప్రవేశించగానే భద్రతాసిబ్బంది గేటు మూసివేశారు. దీంతో దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్ దంపతులు ఆలయం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది.మంత్రి శేఖర్‌బాబు గుర్తించి తిరిగి గేటు వద్దకు చేరుకుని ఆలయంలోకి అనుమతించాలని విన్నవించారు. అనంతరం కుమార గురుబాలన్‌ను మహద్వారం నుంచి అనుమతించి ఆయన సతీమణిని బయోమెట్రిక్ నుంచి అనుమతించారు. శ్రీరంగ నుంచి వచ్చిన వారిలో ఇద్దరు ముందుగా మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడంతో సమస్య తలెత్తినట్టు అధికారులు గుర్తించారు.



కొత్తిండ్లు సచివాలయంలో వస్తువులు దహనం



సచివాలయంలో దగ్ధమైన బోరు మోటారు, స్టార్టర్లు

మదనపల్లె టౌన్, జూలై 16: కొత్తిండ్లు సచివాలయంలో కొందరు దుండగులు జొరబడి విలువైన వస్తువులను దగ్ధం చేశారు. సోమవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది యధావిధిగా తాళాలు వేసుకుని వెళ్లగా కొందరు గుర్తు తెలియని దుండగులు సచివాలయం తాళాలు పగులకొట్టి శానిటరీ వర్కర్స్ గదిలోని బోరు మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ తీగలు, డస్ట్ బిన్‌లు, శానిటరీ వర్కర్స్ యూనిఫాంను దగ్ధం చేశారు. మంగళవారం ఉదయం సిబ్బంది సచివాలయానికి వెళ్లగా తెరచివున్న వర్కర్స్‌గదిని చూసి పంచాయతీ కార్యదర్శి ఆనంద్ జరిగిన విషయాన్ని ఎంపీడీఓ భానుప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనలపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

దిగువపల్లి వద్ద ఇసుక డంప్ సీజ్



ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

పెద్దమండ్యం, జూలై 16: దిగువపల్లి సమీప పెద్దఏరులో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుక డంప్‌ను పెద్దమండ్యం తహసీల్దార్ లక్ష్మీనాయక్ సీజ్ చేసినట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు అధికారులు హుటాహుటిన వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 365 టన్నుల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా గత శుక్రవారం రాత్రి కూడా దిగువపల్లి ప్రాంతంలోనే 125 టన్నుల ఇసుకను అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. పెద్దఏరులో ప్రవాహం తగ్గు ముఖం పట్టినప్పటి నుంచీ అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమంగా నిల్వలు, తరలింపు దందా ఎవరు సాగిస్తున్నారో పోలీసు అధికారులు నిర్ధారించాల్సి ఉందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పోలీసులు వెల్లడించారు. సమాచారం ఇవ్వడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు, డీటీ రవీంద్ర నాయక్, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ నవాజ్, పీసీ జాఫర్‌ఖాన్ మంగళవారం మధ్యాహ్నం హుటాహుటిన వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి సీజ్ చేశారు.

శివ కుటుంబానికి చేయూత



శివ భార్య శంకరమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నేతలు

వాల్మీకిపురం, జూలై 16: కువైట్ ఎడారిలో వేధింపులకు గురైన వాల్మీకిపురం మండలం చింతపర్తి వాసి శివ కుటుంబానికి టీడీపీ జనసేన నేతలు చేయూతనిచ్చారు. గల్ఫ్ దేశం నుంచి శివ తన గోడును సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేయడంతో అది వైరల్ అయి మంత్రి నారా లోకేష్ స్పందించిన విషయం విదితమే. కువైట్ టీడీపీ ఎన్‌ఆర్‌ఐ బృందం శివ ఆచూకీ కనుగొని ఎంబీసీ కార్యాలయానికి తరలించారు. అతన్ని భారతదేశానికి తీసుకు రావడానికి సహాయక చర్యలు కూడా అందిస్తున్నారు. నేడో రేపో శివ స్వగ్రామానికి రానున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో పీలేరు టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, పెట్రోల్ బంక్ యజమాని జమీర్ నేతలతో కలిసి మంగళవారం శివ భార్య శంకరమ్మ, పిల్లలను ఓదార్చి ధైర్యం చెప్పారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేష్, జనసైనికులు రూ.5వేలు నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధికదిగుబడులు



పిచికారీ యంత్రం గురించి వివరిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, జూలై 16: టొమాటో, వేరుశనగ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయాధికారి మురళీమోహన్, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బండ్లపై, రెడ్డివారిపల్లి, రాచవేటివారిపల్లి పంచాయతీల్లో పర్యటించి టొమాటో, వేరుశనగ పంటపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వాటి ద్వారా అనువైన పంట వేసేందుకు అవకాశం వుంటుందన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అనతరం పంటలకు వినియోగించే పిచికారీ మందుల గురించి వివరించి వాటి వాడకంపై రైతుకు సూచనలు చేశారు. కౌలు రైతులకు కూడా అన్ని సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రాజానాయుడు, గణేష్, తదితతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



కురబలకోటలో తనిఖీ చేస్తున్న అధికారులు

కురబలకోట, జులై 16: పారిశుధ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓలు హరినారాయణ, దిలీప్‌కుమార్ అన్నారు. మంగళవారం అంగళ్ళు, కురబలకోట పంచాయతీల్లో టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణాలపై స్పెషల్ టీం వెరిఫికేషన్ చేపట్టారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, గంగాధర్, అబ్దుల్ షుకూర్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

బొప్పాయి రైతుల గగ్గోలు ● నాసిరకం మొక్కలతో నష్టపోయామని ఆవేదన ● నర్సరీలపై చర్యలు తీసుకోవాలని డిమాండు





నాసిరకం బొప్పాయి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘనేతలు - నాసిరకం బొప్పాయి పంటను చూపుతున్న రైతులు

కలికిరి, జూలై 16: నాసి రకం నారు కారణంగా బొప్పాయి పంట నష్టపోయామని, ఎకరాకు రూ.2 లక్షల వంతున నర్సరీ యజమానులు నష్టపరిహారం చెల్లించాలని పలువురు బొప్పాయి సాగు రైతులు డిమాండు చేశారు.

నాసి రకం బొప్పాయి మొక్కల కారణంగా మండలంలో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రైవేటు నర్సరీల్లో కొనుగోలు చేసిన బొప్పాయి మొక్కలు పంట రాబడిలో విఫలమయ్యాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించిన పెట్టుబడులు తిరిగి రాక నిండా మునిగిపోయామని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ఆధ్వర్యంలో పలువురు రైతు సంఘ నేతలు, రైతులు మంగళవారం పలు గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి తోటలను పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో దాదాపు వంద మంది కౌలు రైతులు 200 ఎకరాల్లో బొప్పాయి సాగుచే శారు. ఎకరా భూమిని రూ. 35 నుంచి రూ.45 వేల వరకూ కౌలుకు తీసుకుని సాగుచేశారని వివరించారు. ఒక్కో బొప్పాయి మొక్కను రూ. 11, రూ.12ల వంతున మదనపల్లె, కలికిరిలోని ఎల్లా రెడ్డి నర్సరీ, శేఖర్ రెడ్డి, రాజన్న నర్సరీల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. నాసిరకం మొక్కలను విక్రయించిన నర్సరీలపై ఉద్యాన అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. ఉద్యాన శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే నర్సరీలు మోసాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ పర్యటనలో ఏపీ రైతు సంఘం నేతలు సాంబశివ, నరసింహులు, బొప్పాయి రెతులు రామకృష్ణ, గంగి రెడ్డి, గంగరాజు, వేణుగోపాల్, రమణ, రామమూర్తి, అనిల్, శ్రీనివాసులు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌సీడీసీని పకడ్బందీగా నిర్వహించాలి





తలపులలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది - కలకడ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు

పీలేరు, జూలై 16: కుష్ఠు బాధితులను గుర్తించేందుకు రూపొందించిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెన్(ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యులు రమేశ్ రెడ్డి, చంద్రశేఖర్ నాయక్ ఆదేశించారు. ఎల్‌సీడీసీపై మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణలో వారు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఇంటింటి సందర్శనను పటిష్టంగా చేపట్టాలన్నారు. అలా గుర్తించిన వారికి ఎండీటీ చికిత్స గురించి తెలిపి వారిని పీహెచ్‌సీకి తీసుకురావాలన్నారు. కుష్ఠు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యానికి దారి తీయవచ్చని వ్యాధిగ్రస్తులకు తెలియజేయాలన్నారు. అనంతరం కుష్ఠు వ్యాధి లక్షణాలు, దానిని గుర్తించే విధానం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స విధానాన్ని తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, శ్రీను, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు సర్వేని పూర్తి చేయాలి

కలకడ, జూలై 16: గ్రామాల్లో ప్రతి ఇంటినీ ఆరోగ్య సిబ్బంది సందర్శించి కుష్ఠు సర్వే పూర్తి చేయాలని డాక్టర్ జవహర్‌బాబు సూచించారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుష్ఠును ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందిస్తే వారిలో అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

తంబళ్లపల్లె, జూలై 16: కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా పనిచేద్దామని వైద్యాధికారి మునికుమార్ పిలుపునిచ్చారు. కోసు వారిపల్లె పీహెచ్‌సీ పరిధి తంబళ్లపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు కుష్ఠు పైన అవగాహన చేపడుతూ ఇంటింటా సర్వే చేయడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కుష్ఠు రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రజలకు క్షేత్ర స్థాయిలో సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎంఓ వేణుగోపాల్, సూపర్ వైజర్ జగదీష్, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దపీరు మెరవణి



వేడుకగా సాగుతున్న పెద్దపీరు మెరవణి

తంబళ్లపల్లె, జూలై 16: మొహర్రం ఉత్సవాల్లో బాగంగా మంగళవారం తంబళ్లపల్లెలో పెద్దపీరు మెరవణి కార్యక్రమం అంగ రంగ వైభవంగా జరిగింది. గత వారం రోజులగా తంబళ్లపల్లె పీర్లచావిడిలో పీర్లను కొలువు దీర్చి మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి భక్తులు బాణసంచా పేళుళ్ల, డప్పు వాయిద్యాల నడుమ పెద్ద పీరుకు పూల బాషికాలను సమర్పించారు. ముజావర్లు వాటిని పెద్ద పీరుకు అలంకరించి మంగళవారం తెల్లవారుజామున మెరవణి చేశారు. అనంతరం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామంలో ఊరేగించారు. బుధవారం పీర్లకు జలాధివాసం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మొహరం పండుగ

ప్రత్యేకంగా ముస్తాబైన పీర్లు



మొహరం పండగకు ముస్తాబైన పీర్లు

మదనపల్లె అర్బన్, జూలై16: పోతబోలులో మొహర్రం పండుగను పురస్కరించుకుని చావిళ్లను ముస్తాబు చేశారు. పీర్లను ప్రత్యేకంగా పూలు, గంధంతో అలంకరించి పూజలు నిర్వహించారు. హిందూ ముస్లిం మతసామరస్యానికి ప్రతీకగా పోతబోలులో మొహర్రం పండుగ నిర్వహించారు. హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి పీర్లను జల్దిలో కలిపేశారు.

శివప్రసాద్‌ను సన్మానించిన కళాకారులు



శివప్రసాద్‌ను సన్మానిస్తున్న కళాకారులు

మదనపల్లె అర్బన్, జూలై 16: కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ప్రజా గాయకుడు గొల్లహళ్లి శివప్రసాద్‌ను కళాభిషేకం పేరుతో బాస్ నేతలు ఘనంగా సన్మానించారు. బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీ ఎం శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి కర్ణాటక రాష్ట్ర అగ్రనేతలు వెంకటేష్, మునుస్వామి, ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, ప్రముఖ గాయకుడు బురుజుపల్లె లక్ష్మీనారాయణ, తెలుగు కోకిల భూదేవి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘనేతలు మునివెంకటప్ప, అంజనప్ప గొల్లహళ్లి శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. శివప్రసాద్ జానపద అకాడమీ సేవలను విస్తృతం చేసి ప్రజా ఉద్యమాలకు అండగా ఉండాలన్నారు. గణపతి, కేవీ రమణ, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రయ్య, నీరుగటి రమణ, రెడ్డెప్ప, శ్రీనివాసులు, శశిధర్, మోహన, తలారి కృష్ణ, యోగేంద్ర, కేవి రత్నం, మునిరెడ్డి, గిరిజా తదితరులు పాల్గొన్నారు.

పీలేరు మోడల్ కాలనీలో ఫీవర్ సర్వే



జ్వరపీడితుడిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీలేరు, జూలై 16: ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది స్పందించారు. మోడల్ కాలనీలో జ్వరాలతో బాధపడుతున్న వారి గురించి మంగళవారం సాయంత్రం ఇంటింటి సర్వే నిర్వహించారు. అంతే కాకుండా జ్వరంతో బాధపడుతున్న రమణకు కావాల్సిన వైద్య సాయం అందించారు. 'కోరలు చాస్తున్న డెంగ్యూ' అన్న శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. అందులో పీలేరు మోడల్ కాలనీకి చెందిన రమణ జ్వరంతో బాధపడుతున్నట్లు విషయం రావడం తెలిసిందే. దీంతో అటు వైద్య సిబ్బంది, ఇటు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది స్పందించి మంగళవారం మోడల్ కాలనీలో వైద్య సేవలు, పారిశుధ్య పనులు చేపట్టారు. పీలేరు ఏరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్‌ఈ కొండయ్య, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా వర్కర్లు రమణ ఇంటికి ఇరువైపులా 30 గృహాలలో ఫీవర్ సర్వే నిర్వహించారు. బుధవారం కూడా తమ సేవలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 52 మంది ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జూలై 16: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 52 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్. కృష్ణవేణి పేర్కొన్నారు. జవహర్‌నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో హైదరాబాద్, విజయవాడ నుంచి ఐదు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 66 మంది ఫైనలియర్ విద్యార్థినులు పాల్గొనగా అందులో ప్రతిభ చూపిన 52 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు వేతనాలు అందుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. జవహర్‌నాలెడ్జి సెంటర్ ప్రతినిధి నమ్రత, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్రోబాల్‌లో మదనపల్లె విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె టౌన్, జూలై 16: గుంటూరులో నిర్వహించిన సీబీఎస్‌ఈ రీజనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో మదనపల్లె శ్రీవేద హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరచి ప్రథమ బహుమతి గెలుచుకు న్నారు. సీబీఎస్‌ఈ ఆధ్వర్యంలో గుంటూరులో ఇటీవల నిర్వ హించిన రీజనల్ త్రోబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలం గాణ నుంచి 16 టీములు పోటీపడ్డాయి. ఈ పోటీల్లో ఫైనల్స్‌లో గెలిచి ప్రథమ స్థానంలో నిలిచారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉపేంద్రారెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, పీడీ తదితరులు అభినందించారు.

కుప్పం-హైదరాబాదు బస్సు పునరుద్ధరణ



కలికిరి, జూలై 16: ఐదేళ్లగా ఆగిపోయిన కుప్పం-హైదరాబాదు ఆర్టీసీ సర్వీసును తిరిగి పునరుద్ధరించారు. కుప్పం నుంచి పలమనేరు, పుంగనూరు, కలికిరి, కలకడ, రాయచోటి, కడప మీదుగా నడిచే ఈ సర్వీసును 1995లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ ప్రాంతీయులకు అత్యంత ప్రధానమైన సౌకర్యంగా వున్న దీన్ని వైసీపీ ప్రభుత్వంలో ఆపేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం వాసులకు నేరుగా హైదారాబాదు వెళ్ళేందుకు ఆర్టీసీ సర్వీసులు కరువయ్యాయి. కుప్పంలో సాగుచేసే ఆధునిక రకం పూలను ఈ బస్సు ద్వారానే ఇప్పటికీ అక్కడి రైతులు హైదరాబాదుకు రవాణా చేస్తున్నారు. సాయంకాలం 7 గంటలకు కలికిరి మీదుగా హైదరాబాదుకు సూపర్ లగ్జరీ సర్వీసు 5351 నంబరుతో వెళుతుండగా మరో సర్వీసు హైదరాబాదు నుంచి కలికిరి మీదుగా ఉదయం 6 గంటలకు కుప్పం వెళుతుంది. ఐదేళ్ల తరువాత కుప్పం బస్సు సర్వీసు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగభోగేశ్వరుడికి ఘనంగా రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె అర్బన్, జూలై 16: చిప్పిలి గ్రామం మడిక్కయల శివాలయంలో మంగళవారం యోగభోగేశ్వరుడికి ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ స్వామివారికి విశేషపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూలై16: భార్యను హింసిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ ఇనాయతుల్లా తెలిపారు. పోలీసులు కథనం మేరకు మదనపల్లె పట్టణం, సుభాష్ రోడ్డు వాసి అనితతో వాయల్పాడు మండలం, మల్లిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డికి 16 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్నేళ్లుగా భార్య, భర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో పిల్లలను ఇచ్చేయాలని తన భర్త తనను హింసిస్తున్నాడని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇతనిపై కేసులున్నట్లు తెలిపారు.

రైతు దంపతులపై దాడి కేసు నమోదు

బి.కొత్తకోట, జూలై16: పొలం వద్ద రైతు దంపతులపై ఓ రమణారెడ్డి దాడి చేసి గాయపరచినట్లు పోలీసులు తెలిపారు. నగరపంచాయతీ పరిధిలోని డేగానిపల్లె వాసి రాజారెడ్డి తన పొలంలోని చెత్తను పొలం గట్టుకు తరలించి నిప్పు పెట్టాడు. ఈ మంటల తాకిడికి పక్క పొలంలో ఇదే గ్రామానికి చెందిన రమణారెడ్డి సాగుచేసిన టమోటా పంటలోని నాలుగుచెట్లు కాలిపోయాయి. దీంతో కోపంతో రమణారెడ్డి మంట పెట్టిన రాజారెడ్డి, అతని భార్య రెడ్డెమ్మపై దాడి చేశాడు. ఈ ఘటనలో రైతు దంపతులిద్దరికీ రక్తగాయాలయ్యాయి. బాధితుడు రాజారెడ్డి ఫిర్యాదు పై రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ తెలిపారు.

విద్యార్థినులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, జూలై 16: విద్యార్థినులు ఉన్నత చదువులతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 40వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని మహిళలకు ఉన్నత చదువులు కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో వుండడం గమనార్హమన్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య పెంచితే కొత్త కోర్సులకు అవకాశం వుంటుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు పిల్లలు అండగా నిలవాలని సూచించారు. అనంతరం పలువురు విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీలేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, సీపీడీసీ సభ్యుడు చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఖాజావలి, మోహన్‌బాబు, గురుమూర్తి, విష్ణుప్రియ, వనజ, నమ్రత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సభ్యత్వం పొందండి

జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి పిలుపు

మదనపల్లె, జూలై 16: పార్టీలోని ప్రతి ఒక్క జనసైనికుడూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని జనసేన రాయలసీమ కో-ఆర్డినేటర్ గంగారపు రామ్‌దాస్ చౌదరి పిలుపునిచ్చారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక కమ్మవీధిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. మదనపల్లెలో ఆరువేలకుపైగా సభ్యత్వాలు చేయాలని రామ్‌దాస్‌చౌదరి వలంటీర్లకు సూచించారు. అందరకూ కలసికట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రసంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేష్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, నేతలు సనావుల్లా, గజ్జల రెడ్డెప్ప, మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ సంద్ర, లీగల్ సెల్ అధ్యక్షుడు అమర్‌నారాయణ, రాజేష్, కల్లూరు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, లక్ష్మీపతి, విశ్వనాథ్, వీరమహిళలు పద్మావతి, నాగవేణి, రాజారెడ్డి, లవన్న, జంగాల గౌతమ్, గండికోట లోకేష్, వరికోళ్ల నాగరాజ పాల్గొన్నారు.